క్లుప్తంగా

'ఆరోపణలు సరికాదు'



దామెర: నిరాధారమైన ఆరోపణలుచేస్తే సహించేదిలేదని మండల వీఓఏలు ఆగ్రహం వ్యక్తంచేశారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి వారు మాట్లాడారు. ఇటీవల కాలంలో సామాజిక మాధ్యమాల్లో కొంత మంది తమపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. 99 శాతం రుణాల చెల్లింపుల్లో మండలం అగ్రస్థానంలో ఉందని పేర్కొన్నారు. రుణాల మంజూరు కోసం ఎవరి దగ్గరా డబ్బులు వసూలు చేయలేదని వెల్లడించారు. ఏమైనా ఆధారాలు ఉంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేయడం పునరావృతమైతే ఊరుకోమని హెచ్చరించారు. సమావేశంలో వీఓఏల సంఘం అధ్యక్షురాలు ప్రేమలత, వీఓఏలు అరుణ, రజిత, స్వప్న, కవిత, శ్యామల తదితరులు ఉన్నారు.

చెక్కుల పంపిణీ



ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలంలోని పలు గ్రామాల్లో కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఆర్ఐ రాజు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిట్టంపల్లి అయిలయ్య, అశోక్‌ముఖర్జీ, కొమురయ్య, శివకుమార్, ప్రమోద్‌రెడ్డి, మహేందర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జామెట్రీ బాక్స్‌ల అందజేత

వేలేరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వరంగల్ ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రతినిధులు గణిత జామెట్రీ బాక్స్‌లు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం గౌరిశెట్టి రాజన్న మాట్లాడుతూ.. విద్యార్థులు చదువులో రాణించి పాఠశాలకు, గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని అన్నారు. వరంగల్ ఇన్నర్ వీల్‌క్లబ్ ప్రతినిధులను అడగగానే స్పందించి గణిత జామెట్రీ బాక్స్‌లు అందజేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సాంబయ్య సేవలు మరువలేనివి



ఆత్మకూరు: మండలంలోని నాగయ్యపల్లెకు చెందిన ఎర్ర సాంబయ్య సేవలు మరువలేనివని ఆర్‌పీఐ(రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా) రాష్ట్ర అధ్యక్షుడు పసుల రవికుమార్ అన్నారు. నాగయ్యపల్లె మొదటి ఉపసర్పంచ్‌గా పనిచేసి నిరంతరం ప్రజల సమస్యలపై పోరాటం చేసిన సాంబయ్య జ్ఞాపకార్థం గురువారం దళితవాడలో ప్రజల భాగస్వామ్యంతో ఎర్ర సాంబయ్య కాలనీ నామకరణం చేశారు. ఈసందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. సాంబయ్య సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, డీబీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మాదాసి సురేశ్, న్యాయవాది కలకోటి మహేందర్, గోల్కొండ బుచ్చన్న, మంద సంపత్, డీఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు కేడల ప్రసాద్, చాపర్తి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణ



ఎల్కతుర్తి: ఎల్కతుర్తి విశాల సహకార సంఘం ఆవరణలో 71వ అఖిల భారత సహకార సంఘం వారోత్సవాల సందర్భంగా గురువారం సంఘం అధ్యక్షుడు శ్రీపతి రవీందర్‌గౌడ్ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు లోకిని సూరయ్య, సమ్మయ్య, కృష్ణస్వామి, సమ్మక్క, సీఈఓ తిరుపతి, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చక్రపాణి



వేలేరు: ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలంలోని ఎర్రబెల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు ఎం.చక్రపాణి ఎన్నికైనట్లు ఆసంఘం రాష్ట్ర అధ్యక్షుడు శాగ కైలాసం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన ప్రధానకార్యదర్శి చింత రమేశ్, కార్యవర్గ సభ్యులకు చక్రపాణి ధన్యవాదాలు తెలిపారు.

శాయంపేట: నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే గండ్ర



పరకాల: వివిధ వేషధారణలతో చైతన్య మోడల్ హైటెక్ స్కూల్ విద్యార్థులు



ఘనంగా బాలల దినోత్సవం

- విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహణ
- నెహ్రూ చిత్రపటాలు, విగ్రహాలకు నివాళి

వివిధ పాఠశాలల్లో గురువారం భారత తొలిప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు దేశనాయకుల వేషధారణలో అలరించారు. ఈసందర్భంగా నెహ్రూ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



దామెర: డిస్నీల్యాండ్ పాఠశాలలో..



ఆత్మకూరులో..



ఎల్కతుర్తిలో..



వేలేరు: బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

అధ్వానంగా అంతర్గత రోడ్లు



గుంతలుగా మారిన అంతర్గత రోడ్లు

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- బాగు చేయాలని వేడుకోలు

ఆత్మకూరు: మండలకేంద్రంలో అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. రోడ్లు వేసి దశాబ్దాలు దాటడంతో గుంతలు, పగుళ్లు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. మండలకేంద్రంలో ప్రధానరోడ్లు ఇటీవల వేయడంతో బాగానే ఉన్నప్పటికీ అంతర్గత రోడ్లు గుంతలతో ప్రమాదకరంగా ఉండడంతో గ్రామస్తులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండలకేంద్రంలో వడ్ల వాడ, పెద్దచెరువుకు వెళ్లే రోడ్డు, ఎస్సీ కాలనీ రోడ్డు, చాకలి ఐలమ్మ విగ్రహం నుంచి శివాలయం వెళ్లే రోడ్డు ఇబ్బందికరంగా ఉన్నాయి. రాత్రివేళ బైక్‌లపై వెళ్లే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. ఎంతో కాలంగా రోడ్ల పరిస్థితి ఇలాగే ఉన్నప్పటికీ పట్టించుకునే వారు కరువయ్యారని ప్రజలు వాపోతున్నారు. అలాగే గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ సైతం ఇబ్బంది కరంగా ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. అంతర్గత రోడ్లతోపాటు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్లను పరిశీలించి నూతన రోడ్లు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

రాత్రివేళ ఇబ్బందిగా ఉంటుంది



అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. గుంతలమయంగా మారడంతో ఇబ్బందిగా ఉంటుంది. రోడ్లతోపాటు, డ్రెయినేజీ వ్యవస్థను బాగుచేయాలి.

– ఆరెల్లి మోహన్‌రాజ్

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

శాయంపేట : గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని అన్నారు. విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు జ్ఞానం పెంపొందించే విధంగా గ్రామీణ ప్రాంతాల్లోని గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయాలను వినియోగించుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యేకు వినతి

సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు మూడు నెలలు గడుస్తున్నా వేతనాలు చెల్లించడంలేదని, తమకు పర్మినెంట్ చేయాలని ఎంజేపీ, మైనార్టీ గురుకుల పాఠశాల తరహాలో కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల వేతనాలను పెంచాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కారిస్తానని భరోసా ఇచ్చారు.



పుస్తక ప్రదర్శనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

మహనీయుల జీవిత చరిత్రలు చదవాలి



మాట్లాడుతున్న కజాంపురం దామోదర్

ఐనవోలు: విద్యార్థులు మహనీయుల జీవిత చరిత్రలు చదివి స్ఫూర్తి పొందాలని, విద్యార్థుల్లో పతనమవుతున్న విలువలు, వ్యక్తిత్వ పునఃనిర్మాణం పాఠశాల స్థాయిలోనే జరగాలని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్, ఓరుగల్లు వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థ అధ్యక్షుడు కజాంపురం దామోదర్ అభిప్రాయపడ్డారు. మండల కేంద్రంలోని ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో జిల్లా విద్యాశాఖాధికారి ప్రొసీడింగ్ మేరకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అండ్ ఓరుగల్లు వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థల ఆధ్వర్యంలో సంస్కార వికాస శిక్షణా కార్యక్రమాన్ని ఎంఈఓ పులి ఆనందం అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదర్, సీఎస్‌డబ్ల్యూఏ అధ్యక్షుడు దామెర నర్సయ్య, కార్యదర్శి తేరాల యుగంధర్, ఎంఈఓ ఆనందం, హెచ్‌ఎం సదానందం తదితరులు మాట్లాడారు. సమాజాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దిన మహానుభావుల జీవిత చరిత్రలను చదివి స్ఫూర్తి పొందాలన్నారు. బాల్యంలో కష్టపడితేనే భవిష్యత్‌లో సంతోషంగా, ఆదర్శంగా జీవిస్తారని చెప్పారు. సంస్కారవంతమైన జీవనం గడపాలని, పెద్దలతో వినయ విధేత కలిగి ఉండాలని, మానసిక వికాసం, స్వయం నియంత్రణ, క్రమశిక్షణ, తోటి వారికి సాయం చేయడం తదితర అంశాలపైన అవగాహన కలిగించారు. అనంతరం కష్టపడుతూ ఉన్నతంగా ఎదుగుతామని విద్యార్థులతో నిర్వాహకులు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కొండబత్తిని రాజేందర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



ఆత్మకూరు: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మండలంలోని పెంచికలపేట, పెద్దాపూర్ గ్రామాల్లో గురువారం ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు రవాణ, హమాలీలు, గోనె సంచుల కొరత లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే సన్నధాన్యానికి బోనస్ లభిస్తుందని తెలిపారు. ప్రైవేట్‌లో విక్రయిస్తే బోనస్ లభించదని స్పష్టం చేశారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కమలాపురం రమేశ్, పరికిరాల వాసు, బోరిగం స్వామి, అంబటి రాజస్వామి, మార్క రజనీకర్, కక్కెర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

దామెర: రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని పరకాల ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డి అన్నారు. మండలంలోని ఊరుగొండ(పెద్దాపూర్)లోని పీఏసీఎస్‌లో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు దళారులను నమ్మి మోసపోకూడదని అన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి మద్దతు ధర కల్పిస్తూ కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. అన్నదాతను ఆదుకోవాలనే ఉద్దేశంతో ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. నిబంధనల మేరకు వరిధాన్యం కొనుగోలు చేసి వెంటనే మిల్లులకు తరలించి, జాప్యం లేకుండా అన్‌లోడ్ చేయాలని అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు, రవాణ, హమాలీలు, గోనె సంచుల కొరత లేకుండా చూడాలన్నారు. అంతకు ముందు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బొల్లు రాజు, వైస్ చైర్మన్ అంబటి రాజస్వామి, తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మీదేవి, సీఈఓ శ్రీనివాస్, డైరెక్టర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు సక్రమంగా చేపట్టాలి

కమలాపూర్: ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా చేపట్టి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేశ్ సూచించారు. కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఐకేపీ ఆధ్వర్యంలో నెలకొల్పిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన సన్న, దొడ్డు రకం వరి ధాన్యం వివరాలు నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోళ్లలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా..? అని రైతులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన ధాన్యాన్ని విక్రయానికి తీసుకొచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. అంతకుముందు స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ సురేశ్‌కుమార్, గిర్దావర్ సమ్మయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

నడికూడ: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంతోపాటు, మండలంలోని నార్లపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. రైతులు పండించిన సన్న ధాన్యానికి ప్రోత్సాహకంగా రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ అందజేస్తుందన్నారు. మొదటి రకం వరి ధాన్యానికి రూ.2,320, రెండో రకానికి రూ.2,300 మద్దతు ధర ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పరకాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, పరకాల ఆర్డీఓ నారాయణ, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి పారిక జై సింగ్, ఏపీఎం రమాదేవి, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.



కమలాపూర్: విక్రయానికి వచ్చిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రమేశ్

రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తా

- కమలాపూర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఝాన్సీరాణి



బాధ్యతలు స్వీకరిస్తున్న ఝాన్సీరాణి

కమలాపూర్: రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తానని కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తవుటం ఝాన్సీరాణిరవీందర్ తెలిపారు. కొత్తగా ఏర్పడ్డ కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ తొలి చైర్ పర్సన్‌గా తవుటం ఝాన్సీరాణిరవీందర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఝాన్సీరాణితోపాటు వైస్ చైర్మన్‌గా దేశిని అయిలయ్య, డైరెక్టర్లుగా ఓర్సు తిరుపతి, ఆకినపెల్లి భిక్షపతి, కిన్నెర కృష్ణమూర్తి, వంటకాల అనిల్‌రెడ్డి, సముద్రాల కృష్ణ, మిల్కూరి శ్రీనివాస్, నిగ్గుల లింగయ్య, ఎండీ.యాకూబ్ అలీ, జనగాని శివకృష్ణ, గట్టు శ్రీధర్‌గౌడ్, కెత్తె విజేందర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఝాన్సీరాణి మాట్లాడుతూ.. మండలంలోని రైతులు పండించిన పంట ఉత్పత్తులను విక్రయించడానికి వరంగల్, జమ్మికుంట మార్కెట్లకు వెళ్లకుండా ఇక్కడే విక్రయించుకునేలా మార్కెట్‌లో వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. రైతులకు సేవ చేసే అదృష్టం కల్పించిన రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్‌గౌడ్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్‌లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి రాజా, సూపర్‌వైజర్ యాకయ్య, హనుమకొండ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళాదేవి, ప్రధాన కార్యదర్శి రజిత లహరి, సమ్మక్క జాతర కమిటీ చైర్మన్ అశోక్, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు పుల్లూరి శ్రీనివాస్‌రావు, చరణ్‌పటేల్, చెరిపెల్లి రాంచంద్రం, నాయకులు కుమారస్వామి, ప్రసాద్, సాంబయ్య, చంద్రశేఖర్, భిక్షపతి, మహేందర్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. చైర్‌పర్సన్‌గా నియమితులైన ఝాన్సీరాణిరవీందర్ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

మత్తుపదార్థాలకు బానిస కావొద్దు



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, పోలీసులు

ఎల్కతుర్తి: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వాటికి బానిసలు కావొద్దని ఎల్కతుర్తి సీఐ పులి రమేశ్ సూచించారు. మండల కేంద్రంలో విద్యార్థులచే పోలీస్‌స్టేషన్ నుంచి బస్టాండ్ వరకు ఎస్సై గోదారి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు 'సే నో టు డ్రగ్స్' ప్లకార్డులతో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. డ్రగ్స్ అనేది సమాజానికి చీడపురుగు లాంటిదని, దానిని ఆదిలోనే నిర్మూలించాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. మత్తుకు బానిసై ఎంతోమంది యువత, విద్యార్థులు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ మత్తులో కొందరు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ తమ జీవితాలను బుగ్గిపాలు చేసుకుంటున్నారని వెల్లడించారు. విద్యార్థులు మత్తు, మద్యం తదితర వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా డ్రగ్స్ వినియోగించినట్లు, విక్రయించినట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం అందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ విటల్, కానిస్టేబుల్ సారంగపాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

టవేరా బోల్తా.. ముగ్గురికి గాయాలు

పరకాల: రోడ్డుకు అడ్డుగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని తప్పించేక్రమంలో టవేరా వాహనం అదుపుతప్పి బోల్తాపడిన ఘటన పరకాల పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. మహదేవపూర్ నుంచి పరకాల వైపు వస్తున్న టవేరా వాహనానికి అడ్డుగా అకస్మాత్తుగా ద్విచక్ర వాహనంపై ఓ యువకుడు దూసుకొచ్చాడు. దీంతో టవేరా వాహనం నడుపుతున్న డ్రైవర్ బ్రేక్ వేయడంతో అదుపుతప్పి బోల్తాపడింది. స్థానికులు వాహనాన్ని పైకి లేపారు. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలు కావడంతో పరకాల సివిల్ ఆస్పత్రికి తరలించారు.

కేయూలో లైబ్రరీ వారోత్సవాలు ప్రారంభం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో లైబ్రరీ వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రంథాలయ పితామహుడు ఏఆర్.రంగనాథన్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లైబ్రరీ అసిస్టెంట్ డాక్టర్ సుజాత, ఏఆర్ నేతాజీ, సూపరింటెండెంట్ ప్రభాకర్, మహ్మద్ యూనస్, రాజమౌళి, లావణ్య, గౌతమి, కిషోర్, పున్నంచందర్, విజయరావు పాల్గొన్నారు.

ఇనుపరాతి గుట్టలను పరిరక్షించుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



సమావేశంలో మాట్లాడుతున్న రాజయ్య

ధర్మసాగర్: సుమారు నాలుగు మండలాల పరిధిలో ఉన్న ఫారెస్ట్ భూములైన ఇనుపరాతి గుట్టలను పరిరక్షించుకోవాలని స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. మండలంలోని ముప్పారం గ్రామంలో మాజీ ఎంపీటీసీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోని కొంతమంది నాయకులు అటవీ భూములను ఆక్రమించుకొని ఖనిజ సంపదను దోచుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కొంతమంది కడియం శ్రీహరి అనుచరులు ఫారెస్ట్ అధికారులను బెదిరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి పార్టీ మారింది నియోజకవర్గ అభివృద్ధి కోసం కాదని తన వ్యక్తిగత స్వార్థం కోసమేనని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇనుపరాతి గుట్టల్లో హరితహారం పేరిట వేలాది మొక్కలు నాటినట్లు తెలిపారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇలాంటి చర్యలు మానుకొని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో రెవెన్యూ, అటవీ అధికారులు సర్వే చేపట్టి ఎలాంటి అక్రమాలు చోటుచేసుకోకుండా ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ధర్మసాగర్, వేలేరు బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జ్‌లు కర్ర సోమిరెడ్డి, భూపతిరాజు, లాల్ మహ్మద్, పోలు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

లగచర్ల ఘటనతో ఉద్యోగుల్లో ఆందోళన

ఐనవోలు: లగచర్ల ఘటనతో ఉద్యోగులందరు భయభ్రాంతులకు గురవుతున్నారని ఎంఆర్ఐ, ట్రెంగా జిల్లా అధ్యక్షుడు మరుపట్ల మల్లయ్య ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. ప్రధాన ప్రతిపక్ష నేత కేటీఆర్.. దాడిఘటనను ఖండించకపోవడం శోచనీయం అన్నారు. ఘటనలో ఎంతటి వారున్న చట్టపరంగా ప్రభుత్వం చర్య తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయాలతో ఉద్యోగులను బలిచేయొద్దని కోరారు. సమస్యలు సామరస్యంగా పరిష్కారం చేసుకోకుండా భౌతికదాడులు చేస్తే రెవెన్యూ ఉద్యోగులు పెన్ డౌన్ చేయాల్సి వస్తుందని తెలిపారు.

శివాలయం అభివృద్ధికి సహకరిస్తా..

- కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి



వెంకట్రామ్‌రెడ్డి, వివేక్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

ఆత్మకూరు: మండల కేంద్రంలో వైభవంగా పునఃప్రతిష్ఠించుకున్న శ్రీపార్వతీదేవిసమేత మహాదేవ పంచకూట శివాలయ అభివృద్ధికి సహకరిస్తానని కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన ఇనగాల ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ వివేకానందరెడ్డితో కలిసి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు.